# నేటి పత్రిక ప్రజా వార్త

తెలుగు వారపత్రిక

NETI PATRIKA PRAJA VARTHA Telugu Weekly

సంపుటి: 01 సంచిక : 06 తేదీ : 16-23 జూన్ 2021 విజయవాడ సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు పేజీలు : 4 వెల : రూ. 5.00

VOLUME: 01 ISSUE: 06 DATE :16 -23June 2021 VIJAYAWADA EDITOR:KONDURI SRINIVASARAO PAGES: 4 PRICE : RS. 5.00


## వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ వాహనమిత్ర



అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త : మూడో ఏడాది వైఎస్సార్ వాహన మిత్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. కంప్యూటర్ బటన్ నొక్కి సుమారు 2.48 లక్షల మంది లబ్ధిదారులకు నేరుగా రూ.248.47 కోట్లు జమ చేశారు.ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే.ఇచ్చిన మాటకు కట్టుబడిఈ రోజు మరో మంచి కార్యక్రమం చేస్తున్నాం. వరుసగా మూడో సంవత్సరం ప్రతి ఆటో డ్రైవర్‌కు మంచి చేసే కార్యక్రమమిది. సొంత వాహనం కలిగి ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లగా ప్రతిరోజూ సేవలందిస్తూ, రోజూ లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నారు. అలాంటి అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలందరికీ కూడా 3,648 కిలోమీటర్ల సాగిన నా పాదయాత్ర సమయంలో ఏలూరు సభలో మే 14, 2018న ఒక మాటిచ్చాను.ఆ రోజు వాళ్లు నా దగ్గరకు వచ్చి ప్రభుత్వంలో బాదుడు ఎక్కువ అయింది, ఫెనాల్టీలు ఎక్కువ ఉన్నాయని మొరపెట్టుకున్నారు. ఫెనాల్టీలు కట్టకపోతే ఆటో తిరగదని, రోజుకు రూ.50 ఫెనాల్టీ వేస్తున్నారని ఆవేదన చెందారు. ఇన్సూరెన్స్ కట్టాలంటే దాదాపు రూ.7500 అవుతుందని చెప్పారు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ రావాలి, అది కావాలంటే రిఫేర్లు చేయించాలి. అన్నీ కలిపి దాదాపు రూ.10 వేలు ఖర్చవుతుందని, ఒకేసారి కట్టాలంటే అప్పులు తీసుకోవడం తప్ప మరో గత్యంతరం లేదని చెప్పారు. వారి బాధలు విన్న తర్వాత ఆ రోజు (మిగతా 2వ పేజీలో)

## 'మురళి గారు ఇంటర్ డిస్‌కంటిన్యూ అన్నారు.. కానీ'



### మంత్రి పేర్ని నాని, ఆటోడ్రైవర్ మురళి మధ్య ఆసక్తికర సంభాషణ

అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త :: వైఎస్సార్ వాహన మిత్ర డబ్బు జమ చేస్తున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని, గుంటూరుకు చెందిన ఆటోడ్రైవర్ మేడా మురళి శ్రీనివాస్ మధ్య జరిగిన సంభాషణ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా మూడో ఏడాది, 2.48 లక్షల మంది లబ్దిదారులకు నేరుగా రూ. 248.47 కోట్లు జమ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో.. మేడా మురళి ఆంగ్ల పదాలు ఉపయోగిస్తూ తన వ్యాఖ్యలతో అందరి దృష్టిని ఆకర్షించారు.ఈ నేపథ్యంలో ఒకింత ఆశ్చర్యానికి గురైన మంత్రి పేర్ని నాని.. "మురళి గారూ.. ఇంటర్మీడియట్ డిస్‌కంటిన్యూ అన్నా ఇంగ్లీష్ ఇంత బాగా మాట్లాడుతున్నారు. మాకెందుకో అనుమానంగా ఉంది. పీహెచ్‌డీ చేశారేమో అనిపిస్తోంది" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఇందుకు బదులుగా మరోసారి వెరిఫికేషన్ చేయించినా ఫర్వాలేదు సార్ అంటూ మురళి బదులిచ్చారు. ఇక ఇందుకు స్పందించిన మంత్రి... "నీలాంటి విజ్ఞత ఉన్నవాళ్లు ముఖ్యమంత్రి గురించి బాగా చెప్పటం బాగుంది" అని ప్రశంసించారు. ఈ క్రమంలో.. తాను స్కూల్ పిల్లలను ఆటోలో తీసుకువెళ్తానని, వారు మాట్లాడే ఇంగ్లీష్ విని, తనకూ మాట్లాడటం అలవాటైందన్న మురళి, ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధనకై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో బాగున్నాయని, సామాన్యుల పిల్లలకు మెరుగైన సదుపాయాలు అందిస్తున్నందుకు చేతులెత్తి నమస్కరిస్తున్నా అని కృతజ్ఞతా భావం చాటుకున్నారు.

మా జగనన్న కూడా మా ఖాకీ చొక్కా తొడుకున్నారు..

మేడా మురళి శ్రీనివాస్ మాట్లాడుతూ, "అన్నా నేను గత 17 ఏళ్ళుగా ఆటో నడుపుతున్నాను, ప్రతీ ఏడాది కూడా ఫిట్‌నెస్ మంత్ వస్తుందంటే తెలియని భాధ, భయం ఉండేది, నెలవారీ ఖర్చులు, మెయిన్‌టెనెన్స్ ఇవి కాకుండా ఇన్సూరెన్స్ ఇవన్నీ ఉండేవి. గత ప్రభుత్వంలో రోజుకు రూ. 50 ఫైన్ పెట్టి మా పీక మీద కత్తి పెట్టే పరిస్థితి ఉండేది. మీరు పాదయాత్రలో నేను విన్నాను, నేను ఉన్నాను అన్నట్లుగా ఆటోడ్రైవర్లకు రూ. 10 వేలు ఇస్తున్నారు. మేం ఇంత ధైర్యంగా ఉన్నామంటే మీరే కారణం. మాకు ఫైన్‌లు వేసే ప్రభుత్వాలను చూశాం కానీ మాకంటూ ఒక పథకం పెట్టిన మొదటి సీఎం మీరే. మీరు దేశ రాజకీయ నాయకులకు ఒక రోల్‌మోడల్, ఒక నాయకుడు ఎలా ఉండాలి, ఇచ్చిన మాటకు ఎలా కట్టుబడి ఉండాలి అనే దానికి మీరే ఉదాహరణ.కరోనా కారణంగా కుటుంబం గడవని పరిస్థితుల్లో మీరు ముందుగానే ఇస్తున్నారు. ఏ సంక్షేమ పథకం ఆగకూడదని మీరు మూడో విడత ఇంత కష్టకాలంలో(మిగతా 2వ పేజీలో)

## సీఎం జగన్‌ను కలిసిన 'డీఎస్సీ-2008 అభ్యర్థులు'

### పోస్టింగ్‌లు ఇచ్చినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని '2008-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు' మంగళవారం కలిశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమను సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియామకానికి ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు ఉన్నారు.

## సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన సిక్కా ప్రతినిధులు



అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో సౌత్

### సీఎం సహాయనిధికి 200 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందజేత

ఇండియన్ సిమెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సిక్మా) ప్రతినిధులు కలిశారు. కరోనా నివారణలో భాగంగా సహాయ చర్యల కోసం సీఎం సహాయనిధికి రూ.2 కోట్ల విలువైన 200 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందజేశారు. ఒక్కొక్కటి 10 లీటర్ల కెపాసిటీ ఉన్న కాన్సంట్రేటర్లను విరాళంగా ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌ను కలిసి వివరాలు అందజేసిన వారిలో ఎం.రవీందర్ రెడ్డి (డైరెక్టర్, మార్కెటింగ్, భారతీ సిమెంట్స్), డాక్టర్ ఎస్.ఆనంద్ రెడ్డి (ఎండీ, సాగర్ సిమెంట్స్), ఇంజేటి గోపినాథ్ (సీఈవో, సిక్మా) ఉన్నారు.

## జల్‌జీవన్ మిషన్‌పై వర్క్‌షాప్ ప్రారంభించిన పెద్దిరెడ్డి



అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త : జల్‌జీవన్ మిషన్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ టెక్నికల్ హ్యాండ్‌బుక్‌ను మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. " జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా నీటి వసతి అందిస్తున్నాం. 2024 నాటికి రాష్ట్రంలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఈ ఏడాది రూ. 7,251 కోట్లతో పనులు చేపట్టనున్నాం. వాటర్ గ్రిడ్‌తో మంచినీటి సమస్యకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టనున్నాం" అని పెద్దిరెడ్డి తెలిపారు.

## కాపు కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకానికి ఉత్తర్వులు

విజయవాడ, నేటి పత్రిక ప్రజా వార్త :: కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు అధికార, అనధికార డైరెక్టర్ల నియామకం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారిగా డైరెక్టర్లుగా ఏడుగురు, అనధికార డైరెక్టర్లుగా 12 మంది నియమించేలా ప్రభుత్వం జీవో జారీ చేసింది.

## ప్రయాణం చేస్తూ ప్రజా సమస్యలను ఓపిగ్గా విన్న మంత్రి పేర్ని నాని



మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజా వార్త : నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించే నాయకులు ప్రజల మదిలో అనునిత్యం నిలిచిపోతారు. ప్రయాణంలో కునుకు తీయడమో లేక మొబైల్ ఫోన్లలో మాట్లాడకుంటూనో లేక వీడియో గేమ్లాడుకొంటూ రివ్వున దూసుకుపోయే నేతలను గతంలో చూసేవారం . కానీ , ప్రయాణించే సమయంలో సైతం ప్రజలతో మమేకమై సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ తనను నమ్మిన ప్రజల సాధకబాధలను తీర్చేందుకు తపన పడే మంత్రివర్యులను మనమిపుడే చూస్తున్నాం . రాష్ట్ర రవాణా , సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పేర్ని వెంకట్రామయ్య ( నాని ) మంగళవారం ఉదయం ఆయన 7 గంటల సమయంలో మూడో విడత వైస్సార్ వాహనమిత్ర కార్యక్రమానికి పాల్గొనేందుకు తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంకు ప్రయాణమవుతూ జియో మీట్ అని వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్ ఫాం ద్వారా ఎల్ ఈ డి టీవీలో కనబడి తన కార్యాలయంకు వచ్చిన పలువురు ప్రజలతో ముఖాముఖిగా సంభాషించారు . తొలుత మచిలీపట్నం పట్టణ అభివృద్ధి సంస్థ ( ముడా ) 30 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని , తమకు న్యాయం చేయాలని కోరుతూ కొందరు మంత్రి పేర్ని నానికి విన్నవించారు . గత అయిదు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని , ప్రస్తుతం ముడా కార్యాలయంలోనికి అడుగు పెట్టవద్దని వి సి ఆదేశిస్తున్నారని వారు చెప్పారు .ఈ విషయమై మంత్రి పేర్ని నాని తన వాహనంలో ప్రయాణిస్తూ విన్నారు . ఇటీవలే తాను ముడా వీసీతో మాట్లాడానని తమ శాఖకు రాబడి లేదని దాంతో ఉద్యోగులకు పని లేని పరిస్థితులలో వారిని తొలగించక తప్పడం లేదని ఆయన వివరణ ఇచ్చారని తెలిపారు . పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంకు చెందిన కొప్పనాతి శ్రీనివాస్ అనే మత్స్యశాఖకు చెందిన ప్రభుత్వ ఉద్యోగినని నాని మంత్రి వద్ద తన ఇబ్బంది చెప్పుకొన్నారు . తాను అంధుడినని కావడంతో కార్యాలయంలో ఉండటం లేదని మచిలీపట్నం గిలకలడిండికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి తమ శాఖ కమీషనర్ కు తన విషయమై ఫోన్ చేసి బెదిరిస్తున్నారని తమ బంధువులలో ఆస్తి సంబంధిత తగాదాలతో తలమునకలై ఉంటానని చెప్పారు . దీనిపై మంత్రి మాట్లాడుతూ , మీరే ఉద్యోగం చేస్తున్నారా లేకా కొద్ది జీతానికి మరో ప్రైవేట్ ఉద్యోగిని ఆయా విధులలో ఉంచార అని ప్రశ్నించారు . తనకు తెల్సి శ్రీధర్ అనే వ్యక్తి గిలకలదిండిలో లేరే ..అంటూ మిమ్మలిని బెదిరించేవారి విషయమై జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షులు గోవింద్ తో ఫోన్లో మాట్లాడతానని చెప్పారు . దివ్య అనే ఒక మహిళ మంత్రితో తన బాధ చెప్పుకొంది . గతంలో తాను వాణి హెూటల్ లో పని చేసెనని అక్కడ ఉద్యోగం నుంచి తొలగించడంతో పని లేకపోవడంతో పలు ఆర్థిక ఇబ్బందులు చెందుతున్నానని తనకు నగరపాలక సంస్థలో స్వీపర్ ఉద్యోగం ఇప్పించాలని వేడుకొంది . జి . వాసుదేవ్ అనే ఆర్టీసీ డ్రైవర్ మంత్రి వద్ద కష్టాన్ని చెప్పుకొన్నారు . కొద్దినెలల క్రితం విధి నిర్వహణలో ఒక రోడ్డు ప్రమాదం జరిగిందని అందులో తన తప్పు ఏమీ లేదని అధికారులు నిర్ధారించారని , ఇది జరిగి రెండు నెలలు జరిగినప్పటికీ తన డ్రైవర్ ఉద్యోగం ఇంకా ఇవ్వడం లేదని వాపోయారు .

## త్వరలోనే డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు: ఆదిమూలపు

**-టీడీపీ హయాంలో డీఎస్సీ అభ్యర్థులను పట్టించుకోలేదు**

**-టెన్త్, ఇంటర్ పరీక్షలపై త్వరలో నిర్ణయం**

**-మంత్రి ఆదిమూలపు సురేష్**



అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త :: టీడీపీ హయాంలో డీఎస్సీ అభ్యర్థులను పట్టించుకోలేదని.. వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'డీఎస్సీ-2008' సమస్య 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందన్నారు. అభ్యర్థుల భవితవ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో వ్యవహరించారని పేర్కొన్నారు. డీఎస్సీ అభ్యర్థులను ఎస్జీటీలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. త్వరలోనే డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇస్తామని మంత్రి తెలిపారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలపై త్వరలో నిర్ణయం..రాష్ట్రంలో కరోనా కేసులు తగ్గుతున్నాయని.. టెన్త్, ఇంటర్ పరీక్షలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జులై మొదటి వారంలో ఇంటర్ పరీక్షలు ఉండే అవకాశం ఉందన్నారు. జులై చివరి వారంలో టెన్త్ పరీక్షలు నిర్వహించడానికి పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. సీఎంతో చర్చించి పరీక్షలపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.గత పాలకులు హామీ ఇచ్చి మోసగించారని 'డీఎస్సీ-2008' అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 13 ఏళ్లు మా జీవితాలు కోల్పోయేలా చేశారన్నారు. సీఎం జగన్ తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపారన్నారు. తమ కుటుంబాలు ప్రభుత్వానికి రుణపడి ఉంటాయని డీఎస్సీ అభ్యర్థులు అన్నారు.

# అమెరికాలో కరువు.. ఇండియా వంటగదిలో పిడుగు



-మండిపోతున్న మంచినూనె ధరలు అమెరికాలో తగ్గిన నూనె గింజల దిగుబడి
-పెరిగిన నూనె ముడి పదార్థాల ధరలు
-నాలుగు నెలల్లో రెట్టింపైన ధరలు
-మారిపోయిన మధ్య తరగతి బడ్జెట్ ముఖచిత్రం

న్యూఢిల్లీ : అమెరికా, బ్రెజిల్‌లలో వచ్చిన కరువు.. ఇండియా పాలిట శాపంగా మారింది. అక్కడ పంట ఉత్పత్తులు తగ్గితే దాని ఎఫెక్ట్ ఇండియాపై పడింది. అక్కడ నూనె గింజల ఉత్పత్తి తగ్గితే ఇక్కడ వంట నూనె ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

తగ్గిన దిగుబడి

ఇండియాను మించిన విధ్వంసాన్ని అమెరికా, బ్రెజిల్‌లలో సృష్టించింది కరోనా మహమ్మారి. లక్షల సంఖ్యలో కేసులు వేల సంఖ్యలో మరణాలు అక్కడ నమోదు అయ్యాయి. దీంతో గతేడాది ఆ రెండు దేశాల్లో వంట నూనె తయారీలో ఎక్కువగా ఉపయోగించే సోయా దిగుబడి తగ్గిపోయింది. అమెరికా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారమే ఐదేళ్ల కనిష్ట స్థాయికి సోయా దిగుబడులు అక్కడ తగ్గిపోయి కేవలం 87 మిలియన్ టన్నులకే పరిమితమైంది.

పెరిగిన ధరలు

అమెరికాలోనే దాదాపు డెబ్బై శాతం మేర సోయా పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో ఒక్కసారిగా సోయా ధరలు పెరిగాయి. మరోవైపు మలేషియాలోనే ఇదే పరిస్థితి నెలకొంది. టన్ను పామాయిల్ గింజల ధర ఏకంగా 1007 డాలర్లు పెరిగింది. 2008 తర్వాత ఈ స్థాయిలో ధర పెరగడం ఇదే ప్రథమం. ఒకేసారి ఇటు సోయా, అటు పామాయిల్ పంట ఉత్పత్తుల ధరలు పెరగడంతో దాని ప్రభావం మన వంట నూనెపై పడింది.

దిగుమతులపైనే ఆధారం

మన వంట నూనె అవసరాల్లో దేశీయంగా ఉత్పత్తి అవుతోంది కేవలం 35 శాతమే. మిగిలిన 65 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. మన దగ్గరున్న విదేశీ కరెన్సీ నిల్వల్లో పెట్రోలు, బంగారం తర్వాత అత్యధికంగా ఖర్చు చేస్తోంది వంట నూనెలకే. ఇటు అమెరికా, అటు మలేషియా, ఇండోనేషియాలలో వంట నూనె ముడి పదార్థాల ధర పెరగడంతో నాలుగైదు నెలల్లోనే వంట నూనెల ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి.

తగ్గేది ఉందా ?

ప్రస్తుతం వంట నూనెలపై 35 సుంకాన్ని ప్రభుత్వం విధిస్తోంది. ఇప్పటికిప్పుడు వంటి నూనెల సెగ నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కలగాలంటే ఈ పన్ను తగ్గించడం ఒక్కటే మార్గం లేదంటే. మరోసారి అమెరికా, బ్రెజిల్, మలేషియాలలో వంట నూనె మూల ఉత్పత్తుల దిగుబడి పెరిగే వరకు ఈ ఇబ్బందులు తప్పవు. వంట నూనెల ధరలు పెరగడంతో గత ఏప్రిల్‌లో వంట నూనె అమ్మకాలు 3 శాతం క్షీణించాయి.

# ఖాతాదారులకు ఎస్‌బీఐ అలర్ట్!

కరోనా మహమ్మరి కారణంగా ఆన్‌లైన్ లావాదేవీలు భారీగా పెరగడంతో రోజు రోజుకి సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుంది. ఒకవైపు పోలీసులు ఈ విషయంలో అవగాహన కల్పిస్తుంటే, మరోవైపు బ్యాంకులు కూడా జాగ్రత్తగా ఉండాలని తమ ఖాతాదారులుకు సూచిస్తున్నాయి. తాజాగా ఈ సైబర్ మోసల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తన వినియోగదారులను కోరింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఫోన్ బ్యాంకింగ్, ఎస్ఎంఎస్ బ్యాంకింగ్ ఎంచుకున్న వినియోగదారులు మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి సూచించింది. విలువైన సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని ఎస్‌బీఐ కోరింది. "మా ఖాతాదారులకు గమనిక మోసగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండండి, ఆన్‌లైన్‌లో ఎటువంటి సున్నితమైన వివరాలను పంచుకోవద్దు, తెలియని వారు చెబితే ఏదైనా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవద్దు అని సలహా ఇస్తున్నాము" అని ఎస్‌బీఐ ఒక ట్వీట్‌లో పేర్కొంది. అందులో ఈ మెసేజ్ తో పాటు ఐదు పాయింట్స్ జత చేసింది. అవి.. పుట్టిన తేదీ డెబిట్ కార్డ్ నెంబర్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ యూజర్ ఐడీ, పాస్వర్డ్, డెబిట్ కార్డు పిన్, సీవీవీ, ఓటీపీ వంటి వివరాలను షేర్ చేసుకోవద్దు అని సలహా ఇస్తుంది.

ఎస్‌బీఐ, ఆర్‌బీఐ, ప్రభుత్వ కార్యాలయలు, పోలీసు, కెవైసి అథారిటీ పేరుతో కాల్ చేస్తున్న మోసగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండాలని తన వినియోగదారులకు సూచించింది.




ప్లే స్టోర్ కాకుండా, టెలిఫోన్ కాల్స్ లేదా ఈ-మెయిల్ ఆధారంగా ఏ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని వినియోగదారులను కోరింది.

అలాగే, తెలియని మూలాల నుంచి వచ్చిన మెయిల్స్‌లోని అటాచ్‌మెంట్‌లపై క్లిక్ చేయవద్దు అని తన వినియోగదారులను కోరింది.

ఈ-మెయిల్ లు, ఎస్ఎంఎస్, ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చిన ఆకర్షణీయమైన, అపరిచిత ఆఫర్లకు స్పందించవద్దని ఎస్‌బీఐ తన వినియోగదారులకు తెలిపింది.

# ఐకియాకు భారీ షాక్..!

పారిస్: ప్రముఖ స్వీడిష్ ఫర్నీచర్ కంపెనీ ఐకియాకు ఫ్రాన్స్‌లో భారీ షాక్ తగిలింది. ఆ దేశపు కోర్టు కంపెనీపై సుమారు ఒక మిలియన్ డాలర్ల జరిమానాను విధించింది. ఐకియా తన కస్టమర్ల, ఉద్యోగులపై గూడచర్యం చేసిందని కోర్టు తేల్చింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక స్టోర్లను కలిగి ఉన్న ఐకియా గత కొన్ని సంవత్సరాలుగా వినియోగదారుల, ఉద్యోగుల సమాచారాన్ని అక్రమంగా సేకరిస్తోందని కంపెనీపై ఆరోపణలు ఉన్నాయి. అక్రమ పద్ధతుల ద్వారా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలను సమీక్షించినట్లు ప్రముఖ ఫ్లాట్‌ప్యాక్ ఫర్నిచర్ గ్రూప్ ఆరోపణలు చేయసాగింది. ఉద్యోగుల, కస్టమర్ల గోప్యతకు భంగం వాటిల్లేలా ఐకియా ప్రవర్తించిందని ఫ్లాట్‌ప్యాక్ ఫర్నిచర్ గ్రూప్ తెలిపింది. అంతేకాకుండా ఐకియా తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కస్టమర్ల, ఉద్యోగుల డేటాను వాడినట్లు కోర్టు ధృవీకరించింది. కాగా ఈ విషయంపై ఐకియా స్పందించింది. మరలా ఇలాంటివి జరగకుండా చూస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. ఐకియాకు ఫ్రాన్స్ మూడో అతిపెద్ద ఫర్నిచర్ మార్కెట్ దేశంగా నిలుస్తోంది. సుమారు




ఐకియాకు ఫ్రాన్స్‌లో సుమారు పదివేల మంది ఉద్యోగులు ఉన్నారు.

# రికార్డు క్లోజింగ్



-తగ్గుతున్న కరోనా కేసులు, ఆంక్షల సడలింపు
-ఇన్వెస్టర్లలోఆశలు, కొనుగోళ్లు
-బ్యాంకింగ్ జోరు

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి లాభాలతో కళకళలాడిన సూచీలు రోజంతా అదే ధోరణిని కంటిన్యూ చేశాయి. దాదాపు అన్ని రంగాల షేర్లులాభాల్లో ముగిసాయి. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టడం, లాక్‌డౌన్ ఆంక్షల సడింపుతో ఇన్వెస్టర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఫలితంగా సెన్సెక్స్ 222 పాయింట్లుఎగిసి 52773 వద్ద, నిఫ్టీ 57 పాయింట్ల లాభంతో 15869 వద్ద స్థిరపడ్డాయి. తద్వారా కీలకసూచీలు రెండూ మరో రికార్డ్ క్లోజింగ్‌ను నమోదు చేశాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసిజి, మీడియా రియాల్టీ షేర్లు లాభపడగా, మెటల్, ఫార్మా నష్టపోయాయి. 3 శాతం ఎగిసి ఏషియన్ పెయింట్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇంకా హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలీవర్, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఎస్‌బిఐ లైఫ్, ఇండియన్ ఆయిల్, యుపిఎల్, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి లాభాల్లో ముగిసాయి. మరోవైపు దివిస్ ల్యాబ్స్, అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హిండాల్కో, డాక్టర్ రెడ్డి ల్యాబ్స్, సిప్లా, టైటాన్ నష్టపోయాయి.

# అక్కడ రెస్టారెంట్లకు ఓకే.. లిక్కర్‌కి నాట్ ఓకే

-యాభై శాతం సీటింగ్ కెపాసిటీతో బార్లకు అనుమతి
-రెస్టారెంట్లు, క్లబ్బులకు సైతం పర్మిషన్ మంజూరు
-లిక్కర్ అమ్మకాలపై కొనసాగుతున్న నిషేధం
-ఢిల్లీలో పుంజుకోని హోటల్స్, రెస్టారెంట్ ఇండస్ట్రీ

న్యూఢిల్లీ : మందుబాబులకు ఢిల్లీ సర్కారు ఝలక్ ఇచ్చింది. క్లబ్బులు, బార్లు, రెస్టారెంట్లకు పర్మిషన్ ఇస్తూనే లిక్కర్ సర్వింగ్‌కి నో చెప్పింది. ట్రయల్ బేసిస్ మీద జూన్ 6 నుంచి 21 వరకు యాభై శాతం సీటింగ్ కెపాసిటీతో ఇటీవల ఢిల్లీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రెస్టారెంట్లు, బార్లు, క్లబ్బులు తెరుచుకోవడంతో ఓ పెగ్గు వేద్దామని వెళ్లిన మందుబాబులకు నిరాశే ఎదురవుతోంది. రెస్టారెంట్లు, బార్లలో ఆల్కహాల? అమ్మకాలకు చేయకూడదంటూ ఎక్సైజ్ శాఖ ఆదేశాలు ఉండటంతో చుక్క మందు కూడా వాళ్లకి దొరకలేదు.

కఠిన చర్యలు

కోవిడ? కేసులు పెరిగిపోవడంతో ఏప్రిల్ 19 నుంచి జూన్ 5 వరకు కఠిన లాక్‌డౌన్ అమలు చేసింది ఢిల్లీ సర్కార్. అయితే కేసుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ఇటీవల అన్‌లాక్ ప్రక్రియ మొదలు పెట్టింది. అందులో



భాగంగా రెస్టారెంట్లు ఓపెన్ చేసినా మందుకు మాత్రం నో చెప్పింది. ఢిల్లీ బాబులు బార్లలో గొంతు తడుపుకోవాలంటే మరికొంత కాలం ఎదురు చూడక తప్పదు. బార్లు, రెస్టారెంట్లపై నిఘా పెట్టామని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఆల్కహాల్ అమ్మినట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ హెచ్చరించింది.

త్వరగా ఇవ్వండి

కరోనా కారణంగా ఇప్పటికే రెస్టారెంట్లు, బార్లు, హోటళ్ల రంగం భారీ నష్టాలు చవి చూస్తోందని. పరిస్థితులను అంచనా వేసి త్వరగా తమకు లిక్కర్ అనుమతులు ఇవ్వాలంటూ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

# వీరి భాగస్వామ్యంతో త్వరలోనే రానున్న ఎయిర్ టాక్సీలు..!



-హ్యుందాయ్, జీఎం భాగస్వామ్యంతో త్వరలోనే రానున్న ఎయిర్ టాక్సీలు..!
-మార్కెట్‌పై భారీ అంచనాలు

హ్యుందాయ్ మోటార్స్, జనరల్ మోటార్స్ సంయుక్తంగా ఫ్లైయింగ్ కార్లపై దృష్టిసారించాయి. వీరి భాగస్వామ్యంతో ఫ్లైయింగ్ కార్ల ఉత్పత్తి మరింత వేగం పుంజుకోనుంది. 2025లోపు ఎయిర్ టాక్సీలను మొదలు పెట్టాలని ఇరు కంపెనీలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఫ్లైయింగ్ కార్లలో భాగంగా హ్యుందాయ్ ఎస్-ఏ1 ఎయిర్ టాక్సీలను సీఈఎస్-2020 కాన్ఫరెన్స్‌లో ఇప్పటికే రిలీజ్ చేయగా, జనరల్ మోటార్స్ 2021 జనవరిలో ఫ్లైయింగ్ కాడిలాక్ కాన్సెప్ట్‌ను రిలీజ్ చేసింది. కాగా ఈ ఫ్లైయింగ్ కార్లు హైబ్రిడ్ ఇంజన్ కాన్సెప్ట్‌తో పనిచేయనున్నాయి. ఫ్లైయింగ్ కార్ల రాకతో ట్రాఫిక్ జామ్స్‌కు చెక్‌పెట్టవచ్చునని ఇరు కంపెనీలు భావిస్తున్నాయి. ఎయిర్ టాక్సీల రాకతో వాయు ప్రయాణాల మార్కెట్ విలువ 2040 వరకు సుమారు ఒక ట్రిలియన్ (రూ. 73 లక్షల 28 వేల 450 కోట్లు)కు చేరగా, అదే 2050 సంవత్సరానికి తొమ్మిది ట్రిలియన్లకు చేరుకుంటుందని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. కాగా ఫ్లైయింగ్ కార్లపై ఇప్పటికే ప్రముఖ స్టార్టప్ కంపెనీలతోపాటు, దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీలు టయోటా మోటార్, డైమ్లర్ ఏజీ, చైనాకు చెందిన గీలీ మోటార్ కంపెనీలు దృష్టిసారించాయి.

# హెచ్‌డీఎఫ్‌సీ మొబైల్ యాప్ క్రాష్.. కస్టమర్ల గగ్గోలు

హెచ్‌డీఎఫ్‌సీ మొబైల్ బ్యాంకింగ్ యాప్ నేడు క్రాష్ అయ్యింది. దీంతో చాలా మంది అసహనానికి లోను అయ్యారు. యాప్ బగ్ గుర్తించే వరకు నెట్ బ్యాంకింగ్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని వినియోగదారులను రాజీవ్ బెనర్జీ కోరారు. హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధి రాజీవ్ బెనర్జీ దీనిపై ట్విటర్ లో స్పందించారు. "మేము మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో కొన్ని సమస్యలను ఎదుర్కొన్నాము, ఈ సమస్యను పరిష్కరించిన వెంటనే మీకు అప్‌డేట్ చేస్తాము. అప్పటి వరకు వినియోగదారులు తమ లావాదేవీల కోసం నెట్‌బ్యాంకింగ్‌ను ఉపయోగించుకోవాలని అభ్యర్థించారు. మీకు కలిగిన ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము, ధన్యవాదాలు" అని తెలిపారు. వాచ్‌డీఎఫ్‌సీ మొబైల్ బ్యాంకింగ్ యావ్ వాడటానికి ప్రయత్నించినప్పుడు బ్యాంక్ వినియోగదారులకు స్క్రీన్‌పై ఒక మెసేజ్ ఫ్లాష్ అయినట్లు చూపిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ట్విటర్ వేదికగా బ్యాంక్ అధికారులకు పిర్యాదు చేశారు. ఈ రోజు ఉదయం 11:30 గంటలకు హెచ్‌డీఎఫ్‌సీ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో సమస్య తలెత్తింది. కొంత మంది ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు వారు తెలిపారు. అసలు ఈ సమస్య ఎందుకు వచ్చింది




# భారత్‌లో రయ్..రయ్ : వైరల్ వీడియో



-భారత్ చక్కర్లు కొడుతున్న టెస్లా కార్లు
-ఈ ఏడాది చివరి నాటికి విడుదల.?!
-టెస్ట్ ట్రయల్స్ నిర్వహిస్తున్న టెస్ల?

భారత్‌లో ఇకపై ప్రముఖ ఎలక్ట్రిక్ టెస్లా కార్లు రయ్ రయ్ మంటూ రోడ్లపై సందడి చేయనున్నాయి. టెస్లా, స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ టెస్లా-3 నెంబర్ మోడల్ కార్లను ఈ ఏడాది చివరి నాటికి భారత్‌లో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మోడల్ కార్లతో ప్రపంచ దేశాల్ని ఆకర్షిస్తున్న టెస్లా ఇక భారత్ మార్కెట్ పై కన్నేసింది. ఈ నేపథ్యంలో టెస్లా కార్లు ముంబైకి చెందిన ఓ ప్రాంతంలో టెస్ట్ ట్రయల్స్ నిర్వహించింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విలాసవంతమైన తన కార్లను భారతీయులను అందుబాటులోకి తీసుకొచ్చే క్రమంలో షోరూంలను, డీలర్‌షిప్‌లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే బెంగళూరు (కర్ణాటక) కేంద్రంగా టెస్లా ఇండియా మోటార్స్ అండ్ ఎనర్జీ పేరుతో రిజిస్టర్ చేయించింది. దీంతో పాటు ముంబై హెడ్ ఆఫీస్ గా..కొన్ని ప్రధాన నగరాల్లో డీలర్‌షిప్‌లను ఏర్పాటు చేసి ఈ ఏడాది చివరి నాటికి కార్లను విడుదల చేసేందుకు సంస్థ ప్రతినిథులు నిర్విరామంగా కృషి చేస్తున్నారట. బ్లూ డ్యూయెల్ మోటార్ టెస్లా 3వ నెంబర్ మోడల్ కారు టైర్లు 18ఇంచెన్, ఏరో బాడీ కిట్ మోడల్, స్టాండర్డ్ రేంజ్ ప్లస్ వేరియంట్ల కోసం 54 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్, లాంగ్ రేంజ్ పెర్ఫార్మెన్స్, 82 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఇందులో ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయి. దాదాపు 381 కిమీ నుండి 614 కిలోమీటర్ల మధ్య లో టెస్లా-3 దూసుకుపోనుంది. ఆకట్టుకునే ఫీచర్లతో చైనాలో తయారై దేశీయ మార్కెట్‌లో అడుగుపెట్టబోతున్న ఈ టెస్లా కారు ధర సుమారు రూ.55లక్షల నుంచి 70లక్షల మధ?ృలో ఉండనుంది. అయితే టెస్లా 3వ నెంబర్ మోడల్ కారు భారత్ లో విడుదల అవుతుందా లేదా అనే అంశంపై టెస్లా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీంతో పాటు ఇది కంప్లీట్లీ బిల్ట్-అప్ (సిబియు) లేదా కంప్లీట్లీ నాక్డ్ డౌన్ (సికెడి) ను ఎంచుకుంటుందా అనేదానిపై ఇంకా క్లారిటీ లేదు.

# ఫ్రాంక్లిన్ ఏఎంసీ, ఉద్యోగులపై భారీ జరిమానా



న్యూఢిల్లీ: డెట్ ఫండ్స్ విషయంలో నిబంధనలకు పాతరేసిన ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ అస్సెట్ మేనేజ్‌మెంట్ సంస్థ (ఏఎంసీ)పై, సీనియర్ ఉద్యోగులు, ట్రస్టీలపై సెబీ రూ.15 కోట్ల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2020 ఏప్రిల్‌లో ఈ సంస్థ ఆరు డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలను రాత్రికి రాత్రే మూసివేస్తూ నిర్ణయాన్ని ప్రకటించింది. ఫలితంగా రూ.25వేల కోట్ల మేర ఇన్వెస్టర్ల పెట్టుబడులు చిక్కుకుపోయాయి. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించిన సెబీ.. ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ ట్రస్టీ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌పై రూ.3 కోట్లు, ఫ్రాంక్లిన్ ఏఎంసీ ప్రెసిడెంట్ సంజయ్ సప్రే, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంతోష్ కామత్ ఒక్కొక్కరూ రూ.2 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. అలాగే ఫండ్ మేనేజర్లు కునాల్ అగర్వాల్, పల్లబ్ రాయ్, సచిన్ పద్వాల్‌దేశాయ్, ఉమేశ్ శర్మ, మాజీ ఫండ్ మేనేజర్ సుమిత్ గుప్తా 1.5 కోట్లు చొప్పున చెల్లించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. అలాగే ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ మ్యూచువల్ ఫండ్ చీఫ్ కాంప్లియన్స్ ఆఫీసర్ సౌరభ్ గంగ్రేడ్‌కు రూ.50 లక్షల జరిమానా విధించింది. 45 రోజుల్లోగా ఈ మొత్తాలను చెల్లించాలని ఆదేశించింది. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలో లోపాలు జరగకుండా చూడడంలో వీరంతా విఫలమైనట్టు.. విధుల నిర్వహణ యూనిట్ హోల్డర్ల ప్రయోజనాలను కాపాడే విధంగా లేవని తేల్చింది. ఈ ఆదేశాలతో తాము విభేదిస్తున్నామని.. సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో సవాలు చేస్తామని ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ అధికార ప్రతినిధి ప్రకటించారు.

నేటి పత్రిక ప్రజా వార్త, తెలుగువారపత్రిక
Neti Patrika Praja vartha, Telugu Weekly
విజయవాడ, 16-23 జూన్ 2021

# థర్డ్‌వేవ్ హెచ్చరికలు: ఏపీ సర్కార్ ముందస్తు ప్రణాళిక




## కోవిడ్ నివారణపై మంత్రి ఆళ్లనాని అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ భేటీ

అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త :: థర్డ్‌వేవ్ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసింది. పీడియాట్రిక్ అంశాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కోవిడ్ నివారణపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని అధ్యక్షతన మంగళవారం కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కురసాల కన్నబాబు, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, డాక్టర్ సిదిరి అప్పలరాజు, పలువురు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఆళ్ల నాని మాట్లాడుతూ, చిన్నారులకు వైద్యం కోసం అదనంగా వైద్యులు, సిబ్బందిని నియమించాలని, జనావాసాలకు దగ్గరగా హెల్త్ హబ్‌లు ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో చిన్నారులకు వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్‌ను పరిశీలించాలన్నారు. చిన్నారులకు అవసరమైన చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. థర్డ్‌వేవ్‌లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లల తల్లులకు వ్యాక్సినేషన్ ముమ్మరం చేయాలని, అర్హులైన తల్లులకు ఒక రోజు ముందుగానే టోకెన్లు పంపిణీ చేయాలని తెలిపారు. బ్లాక్ ఫంగ్ సోకిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. ఇంజక్షన్లు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆళ్ల నాని హెచ్చరించారు.

# ప్రధాన పరీక్షల నిర్వహణలో అవకతవకలు



అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త ::గ్రూప్-1 ప్రధాన పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎనిమిది వ్యాజ్యాలు విచారణకు వచ్చాయి. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వులో ఉంచింది.

గ్రూప్-1 ప్రధాన పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. డిజిటల్ వాల్యూయేషన్ గురించి చివరి దశలో తెలిపారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. తెలుగు మీడియం పేపర్లను రాష్ట్రంలోనూ, ఆంగ్ల మీడియం పేపర్లను ఇతర రాష్ట్రాల్లోనూ వాల్యూయేషన్ చేశారని, దీంతో ఆంగ్ల మీడియంలో రాసిన విద్యార్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులతో వాల్యూయేషన్ ఎలా చేయిస్తుందని వాదించారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను పక్కన పెట్టి కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించారని హౌపిటిషనర్ వాదించారు. ఇంటర్వ్యూలను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. నిబంధనల ప్రకారమే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాల్యూయేషన్ గురించి ముందుగా చెప్పాల్సిన అవసరం లేదని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. త్వరలోనే గ్రూప్-1 ఇంటర్వ్యూలు జరగనుండటంతో తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# పేకాట శిబిరంపై పోలీసులు దాడి



గూడూరు, నేటి పత్రిక ప్రజా వార్త :
గూడూరు మండలం రాయవరం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి. ఆరుగురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద గల రెండు బైకులు, పదహారు వందల యాభై రూపాయలు నగదు సీజ్ చేశారు. ఈ దాడిలో గూడూరు ఎస్ఐ సిహెచ్ దుర్గాప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి మంచి నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



ఏలేశ్వరం,నేటి పత్రిక ప్రజా వార్త :ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన మంచినీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఏలేశ్వరంలో 50 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పనులను ఆయన జాయింట్ కలెక్టర్ లక్ష్మీ షా తో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మండలంలోని సిరిపురం గ్రామంలోహొ కౌలు రైతులు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిల్టర్ వాటర్‌హొ ప్లాంట్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఏలేశ్వరం నగర ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు శివారు ప్రాంతాలకు సైతం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మున్సిపల్ చైర్ పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య,హొ వైకాపా మండల ఇంచార్జ్ బదిరెడ్డి గోవిందు బాబు, తాసిల్దార్ మెట్ల రజనీ కుమారి, ఎంపీడీవో ఎం గోవింద్ తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు....



అమరావతి, మహిత బ్యూరో, జూన్ 15:క్యాంప్ కార్యాలయంల సీఎం వైయస్.జగన్‌ను 2008 డియస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు మంగళవారం సీఎం జగన్ కలిశారు.పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమను సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియామకానికి ఆమోదం తెలపడం పట్ల ముఖ్యమంత్రి ని కలసి కృతజ్ఞతలు తెలిపారు. 2008-డియస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు.విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు తదితరులున్నారు

# కార్మిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలి.




## కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ఆప్కాస్ సర్కులర్ ను రద్దు చెయ్యాలి. శేషుబాబ్జీ

గొల్లప్రోలు నేటి పత్రిక ప్రజా వార్త : మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మె లో భాగంగా గొల్లప్రోలు పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నగర పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు శేషుబాబ్జీ మీడియాతో మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ఆప్కాస్ సర్కులర్ ను రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ అలవెన్స్ బకాయిలను కార్మికులు అక్కౌంట్లకు జమ చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ. కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా కరోనా బారినపడి మరణించిన 80 మంది కార్మికులకు, 50 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ప్రకటించి మరియు కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరణం విశ్వనాథం,కుంచె చిన్న, వై సత్య మోహన్, సిహెచ్ రమణ, నీలాపు ఏసమ్మ, సి హెచ్ రామారావు, సిహెచ్ రాజు, వై దుర్గా, బి సత్యవతి, అన్నవరం, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఐఏఎస్ ఉదయలక్ష్మికి నాన్ బెయిలబుల్ వారెంట్!

అమరావతి, నేటి పత్రిక ప్రజా వార్త : రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉదయలక్ష్మికి ఏపి హైకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పిఇటి) అంశంలో కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడంతో ఈ వారెంట్ జారీ అయింది. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన రత్నకుమార్ అనే పిఇటి ఉపాధ్యాయుడు తనకు అన్యాయం చేశారంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రత్నకుమార్‌కు న్యాయం చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే గతంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌గా పనిచేసిన ఉదయలక్ష్మి హైకోర్టు ఆదేశాలను పట్టించుకోలేదు. దీన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించిన న్యాయస్థానం.. వచ్చే విచారణలో ఉదయలక్ష్మిని హాజరుపరచాలని గుంటూరు ఎస్పిని ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని గతంలో విద్యాశాఖలో పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలపాటు వాయిదా వేసింది.

# సురాపురం గ్రామంలో రేషన్ బియ్యం పట్టివేత



నిడదవోలు,నేటి పత్రిక ప్రజా వార్త :ఆంధ్ర ప్రదేశ్ లో ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్న రేషన్ బియ్యం అక్రమాలు ఆగటం లేదు.నిడదవోలు మండలం సూరాపురం గ్రామం లో గత కొంత కాలంగా పీడీఎస్(రేషన్ బియ్యం) బియ్యం అక్రమంగా రవాణా జరుగుతుందని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో జిల్లా సివిల్ సప్లై అధికారుల వద్ద నుండి రాబడిన సమాచారం మేరకు కొవ్వూరు ఎ.యస్.ఓ మరియు నిడదవోలు సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ఆధ్వర్యంలో మంగళవారం నిడదవోలు మండలం సురాపురం గ్రామంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే గత కొంతకాలంగా సురాపురం గ్రామంలో పీడీఎస్ బియ్యం భారీ ఎత్తున అక్రమ రవాణా జరుగుతుందని వార్తలు వినిపించాయి. దీంతో మంగళవారం సివిల్ సప్లై అధికారులు నిల్వ ఉంచిన పాక పై దాడి చేసి 12 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎమ్.ఎల్.యస్ పాయింట్ కి తరలించారు.

### నిల్వ ఉంచిన బియ్యం పాక ఎవరిది?

సురాపురం గ్రామం లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన పాక ఎవరిదనేది ప్రశ్నార్థకంగా మారింది. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సందర్భంలో సరుకు మాది అని ఎవరూ ముందుకు రాకపోవడంతో సివిల్ సప్లై అధికారులు బియ్యాన్ని ఎమ్.ఎల్.ఎస్ పాయింట్ కి తరలించామని అధికారులు తెలియజేశారు. వాస్తవానికి సురాపురం గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు కనుసన్నల్లో రేషన్ బియ్యం వ్యాపారం జరుగుతుందని సమాచారం.

# రాష్ట్రవ్యాప్తంగా 1.21 కోట్ల కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ



గుడివాడ, నేటి పత్రిక ప్రజా వార్త : రాష్ట్రవ్యాప్తంగా జూన్ నెలకు సంబంధించి ఇప్పటి వరకు ఒక కోటి 21 లక్షల 37 వేల 359 బియ్యం కార్డుదారులకు ఉచితంగా నాణ్యమైన సార్టెక్స్ బియ్యం అందజేసినట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడలో మంత్రి కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం ఒక కోటి 47 లక్షల 73 వేల 660 బియ్యం కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల్లోని ఒక్కో కుటుంబ సభ్యుడికి గత మే, ప్రస్తుత జూన్ నెలల్లో 10 కేజీలు చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందజేయడం జరుగుతోందన్నారు. గత ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన లాక్డౌన్ ఆంక్షల కారణంగా పేదలు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశ్యంతో 16 విడతలుగా నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేశామన్నారు. కరోనా సెకండ్ వేవ్ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మరోసారి నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని సీఎం జగన్మోహనరెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా కర్నూలు జిల్లాలో మొత్తం 12 లక్షల 18 వేల 884 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 10 లక్షల 15 వేల 232 కార్డులకు ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేశామని తెలిపారు. అలాగే ప్రకాశం జిల్లాలో మొత్తం 9 లక్షల 99 వేల 724 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 8 లక్షల 31 వేల 244 కార్డులకు, పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 12 లక్షల 45 వేల 356 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 10 లక్షల 37 వేల 624 కార్డులకు, వైఎస్సార్ కడప జిల్లాలో మొత్తం 8 లక్షల 16 వేల 930 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 6 లక్షల 76 వేల 423 కార్డులకు, చిత్తూరు జిల్లాలో మొత్తం 11 లక్షల 59 వేల 252 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 9 లక్షల 26 వేల 767 కార్డులకు, విశాఖపట్నం జిల్లాలో మొత్తం 12 లక్షల 75 వేల 895 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 10 లక్షల 87 వేల 881 కార్డులకు, విజయనగరం జిల్లాలో మొత్తం 6 లక్షల 97 వేల 598 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 5 లక్షల 77 వేల 753 కార్డులకు, అనంతపూర్ జిల్లాలో మొత్తం 12 లక్షల 22 వేల 637 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 10 లక్షల 18 వేల 403 కార్డులకు, గుంటూరు జిల్లాలో మొత్తం 14 లక్షల 83 వేల 459 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 12 లక్షల 09 వేల 518 కార్డులకు, తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 16 లక్షల 48 వేల 507 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 12 లక్షల 90 వేల 309 కార్డులకు, కృష్ణాజిల్లాలో మొత్తం 13 లక్షల 01 వేల 929 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 10 లక్షల 86 వేల 187 కార్డులకు, శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 8 లక్షల 14 వేల 257 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 6 లక్షల 78 వేల 035 కార్డులకు, నెల్లూరు జిల్లాలో మొత్తం 8 లక్షల 89 వేల 232 బియ్యం కార్డులు ఉండగా ఇప్పటి వరకు 7 లక్షల 01 వేల 983 కార్డులకు ఉచితంగా బియ్యాన్ని అందజేసినట్టు తెలిపారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా బియ్యం కార్డుదారులకు నిత్యావసరాల పంపిణీ సక్రమంగా సాగుతోందన్నారు. కర్నూలు జిల్లాలో 83.29 శాతం, ప్రకాశం జిల్లాలో 83.14 శాతం, వైఎస్సార్ కడప జిల్లాలో 82. 80 శాతం, అనంతపూర్ జిల్లాలో 83.29 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 83. 31 శాతం, చిత్తూరు జిల్లాలో 79.94 శాతం, గుంటూరు జిల్లాలో 81.53 శాతం, విజయనగరం జిల్లాలో 82.82 శాతం, విశాఖపట్నం జిల్లాలో 85.26 శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 78.27 శాతం, కృష్ణాజిల్లాలో 83. 42 శాతం, శ్రీకాకుళం జిల్లాలో 83.27 శాతం, నెల్లూరు జిల్లాలో 78.94 శాతం పంపిణీ ప్రక్రియ పూర్తయినట్టు మంత్రి కొడాలి నాని తెలిపారు.

# నూతన మార్కెట్ యార్డు, ఆర్ టి ఓ కార్యాలయల స్థలాలను పరిశీలించిన. జెసి లక్ష్మీ షా



శంఖవరం ,నేటి పత్రిక ప్రజా వార్త : మండల కేంద్ర మైన శంఖవరం గ్రామం అభివృద్ధి కొరకై ప్రత్తిపాడు శాసన సభ్యులు పర్వత ప్రసాద్ ప్రోత్సాహంతో ఏర్పాటు చేస్తున్న నూతనవ్యవసాయ మార్కెట్ యార్డ్, ఆర్టిఓ ఆఫీసు కొరకు కేటాయించిన స్థలాలను గతంలో పెద్దాపురం ఆర్ డి ఓ పరిశీలించి ప్రతిపాదనలు పంపంగా అదే అంశం పై మంగళవారం జాయింట్ కలెక్టర్ లక్ష్మి షా శంఖవరం గ్రామ శివారులో గల స్థలాలను ప్రత్తిపాడు శాసన సభ్యులు పర్వత ప్రసాద్ మరియు మండల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ టి ఓ కార్యాలయం, మార్కెట్ యార్డు కొరకు కేటాయించిన స్థలాలు అనుకూలంగా ఉన్నాయి వీటి యొక్క నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళి త్వరలోనే ఏర్పాటు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్ డి ఓ యస్ మల్లిబాబు, తహశీల్దార్ కె సుబ్రహ్మణ్యం, మండల అభివృద్ధి అధికారి జె రాంబాబు వైకాపా నాయకులు పర్వత వెంకటేశ్వరరావు(స్వామి), వి ఆర్ ఓ సితారామ్, నరేష్, సర్వేయర్ లు తదితరులు పాల్గొన్నారు.

# భూమ్మీద మరో మహా సముద్రం.. ఇది చాలా డిఫరెంట్!

న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజా వార్త :: భూమి ఉపరితలంపై 70% నీళ్లేనని, నాలుగు మహా సముద్రాలు ఉన్నాయని చిన్నప్పుడు బడిలో వల్లెవేసే ఉంటాం. వాటి పేర్లు బట్టీపట్టే ఉంటాం. మరి ఆ నాలుగు మహా సముద్రాలకు తోడుగా ఇప్పుడు ఇంకో మహా సముద్రం వచ్చి కలిసింది తెలుసా? ఆ నాలుగింటికి భిన్నంగా ఉండే ఈ కొత్త మహా సముద్రానికి ఎన్నో ప్రత్యేకతలు, దానితో మనకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఆ మహా సముద్రం విశేషాలు ఏమిటో తెలుసుకుందామా? మనం చిన్నప్పటి నుంచి చదువుకున్నట్టు పసిఫిక్, హిందూ, అట్లాంటిక్, ఆర్కిటిక్.. ఈ నాలుగూ మహా సముద్రాలు. ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మధ్య నిలువుగా ఉండేది అట్లాంటిక్ మహా సముద్రం.. ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల మధ్య హిందూ మహా సముద్రం.. ఆసియా, ఆస్ట్రేలియాలకు, ఉత్తర, దక్షిణ అమెరికాలకు మధ్య అత్యంత భారీగా ఉండేది పసిఫిక్ మహా సముద్రం.. పైన ఉత్తర ధ్రువం ప్రాంతంలో ఉండేది ఆర్కిటిక్ మహా సముద్రం.. ఇప్పుడు కొత్తగా గుర్తించినది దక్షిణ (సదరన్) మహా సముద్రం. భూమి దక్షిణ ధ్రువ ప్రాంతంలో అంటార్కిటిక్ ఖండానికి చుట్టూ ఆవరించి ఉంది. ప్రపంచ మహా సముద్రాల దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీనే నేషనల్ జియోగ్రఫిక్ సొసైటీ దీనిని కొత్త మహా సముద్రంగా గుర్తిస్తూ.. మ్యాప్‌లో చేర్చింది. ప్రపంచవ్యాప్తంగా దీనికి ఆమోదం రావాల్సి ఉంది.నిజానికి వివిధ ఖండాల మధ్య సువిశాల నీటి భాగాలను మహా సముద్రాలుగా గుర్తించారు. ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్ మహా సముద్రం కూడా భూభాగాల మధ్యనే ఉంటుంది.

# మహాకవి శ్రీ శ్రీ 38 వ వర్ధంతి

ఐ పోలవరం, నేటి పత్రిక ప్రజా వార్త :ఐ.పోలవరంలో సాహితీ సరాగాలు పి టి ఎం ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా శ్రీ శ్రీ చిత్రపటానికి మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రమజీవుల జీవన సమరానికి అద్దంపట్టే శ్రీశ్రీ సాహిత్యం యుగాల పాటు వెలుతుందని కవి సమ్మేళనం లో పలువురు కవులు గానం చేశారు. అనంతరం ఇటీవల మరణించిన పి టి ఎం సంస్థ ఆత్మీయుతల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.పుల్లేపు వెంకటేశ్వరరావు సారధ్యంలో స్థానిక సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, దంగుడు బియ్యం నారాయణ రావు, గోకవరపు వెంకట్ రాజు, కే.దుర్గాబాయి, రేవు యజ్ఞశ్రీ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాధనాల బాబురావు, జంపాల సత్యనారాయణ, పత్తి సత్తిబాబు, సిహెచ్ బలరాం, కొర్లపాటి ప్రసాద్, నందుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 16013, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.